రైల్వే గేటు పడితే పడిగాపులే!

- కలగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- వాహనదారులకు తప్పని నిరీక్షణ
- అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

ఇబ్రహీంపట్నం-మేడిపల్లి క్రాసింగ్ మధ్య ఉన్న రైల్వే గేటు

మెట్‌పల్లి, ఫిబ్రవరి 23: మేడిపల్లి క్రాసింగ్ 63వ జాతీయ రహదారి నుంచి ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో రైల్వే గేటుతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాలతో పాటు నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల, తాళ్లరాంపూర్, బట్టాపూర్, గుమ్మిర్యాల, తడపాకల్, దొంచంద, నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు లక్ష్మణచాంద, మామడ, తదితర మండలాల్లోని పలు గ్రామాల నుంచి మెట్‌పల్లి, కోరుట్ల, తదితర ప్రాంతాలకు నిత్యం వచ్చిపోయే వాహనాలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకల సంఖ్య ఇటీవల పెరిగింది. తరచూ గేటు పడడం, అది కూడా రైలు వచ్చే కంటే అర గంట ముందే గేటు వేయడంతో వాహనదారులు, ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. వాహనాల రాకపోకల సంఖ్య ఎక్కువగా ఉండే ఈ దారిలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలనే డిమాండ్ గత కొన్ని సంవత్సరాలుగా వినిపిస్తున్నా పట్టించుకునే వారు లేరనే విమర్శలు వస్తున్నాయి. రైల్వే గేటు సమీపంలోని వంతెన కింది నుంచి వాహనాల రాకపోకలకు అవకాశం ఉన్నప్పటికీ అప్రోచ్ రోడ్డును కనీసం పట్టించుకోవడం లేదు. ఈ అప్రోచ్ రోడ్డును అభివృద్ధి చేస్తే కనీసం భారీ వాహనాలు వెళ్లకపోయినా కార్లు, జీపులు, ఆటోలు, బైక్‌లు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది. కనీసం అప్రోచ్ రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీఈ సీహెచ్ విద్యాసాగర్
- పాలాస వ్యవసాయ కళాశాలలో క్రీడాపోటీలు ప్రారంభం

మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ జీఈ సీహెచ్ విద్యాసాగర్

జగిత్యాల, ఫిబ్రవరి 23: క్రీడలు మానసిక ప్రశాంతతోపాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని, రోజువారి విధుల్లో ఉల్లాసంగా ఉండేందుకు ఎంతో ఉపయోగపడుతాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీఈ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విశ్వ విద్యాలయం బోధనేతర సిబ్బంది క్రీడా పోటీలను జిల్లాలోని పొలాసలో వ్యవసాయ కళాశాల వేదికగా నిర్వహించారు. ఆది, సోమ, మంగళవారాల్లో నిర్వహించే ఈ పోటీలను విద్యాసాగర్ ప్రారంభించి, మాట్లాడారు. క్రీడాపోటీలతో బోధనేతర సిబ్బందికి ఉల్లాసం పెరిగి ఆరోగ్యం, నైపుణ్యం మరింత పెరుగుతుందన్నారు. పోటీల్లో భాగంగా బోధనేతర సిబ్బంది డ్రెస్‌కోడ్‌లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి వ్యవసాయ గీతాలాపన, జ్యోతిప్రజ్వలన ప్రతిజ్ఞ నిర్వహించారు. 175మంది బోధనేతర సిబ్బంది పోటీల్లో పాల్గొనగా, స్థానిక నార్తన్ తెలంగాణ జోన్ (జగిత్యాల) జట్టుతోపాటు రాజేంద్రనగర్‌జోన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ జోన్, సెంట్రల్ తెలంగాణజోన్ (వరంగల్), సౌత్ తెలంగాణ జోన్(పాలెం) జట్లు పాల్గొంటున్నాయి. క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, రన్నింగ్, జావలిన్‌త్రో, క్యారమ్స్, షటిల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తర మండల వ్యవసాయ ఉపసంచాలకురాలు డాక్టర్ డీ శ్రీలత, యూనివర్సిటీ క్రీడా పరిశీలికుడు డాక్టర్ జే సురేశ్, యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, ఉపాధ్యక్షుడు పీ మహేశ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ జహంగీర్, జాయింట్ సెక్రటరీ జయరాం, కళాశాల ఓఎస్‌ఏ డాక్టర్ ఎన్ మహేశ్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జీ వెంకటగణేశ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

- చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం చేశారంటూ కుటుంబసభ్యుల ఆరోపణ

జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో స్ట్రెచర్‌పై ఉన్న స్నేహిత్‌రెడ్డి

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 23: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు మృతి చెందగా, ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం చేయడంతోనే మరణించాడని బంధువులు ఆరోపించడం, సంబంధిత ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన స్నేహిత్‌రెడ్డి (21) శనివారం రాత్రి కోరుట్ల వైపు నుంచి బైక్‌పై జగిత్యాలకు వస్తున్నాడు. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి శివారులో కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తీసుకువచ్చారు. అయితే, దవాఖానలో వైద్యులు సమయానికి చికిత్స అందించలేదని, వేరే దవాఖానకు రెఫర్ చేయలేదని, దీంతో తామే కరీంనగర్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు స్నేహిత్‌రెడ్డి బంధువులు, స్నేహితులు ఆరోపించారు. దవాఖానలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ కొన్ని ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అవి వైరల్ అయ్యాయి. జిల్లా దవాఖాన వైద్యులు, సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. కాగా, ఈ విషయమై ఇన్‌చార్జి ఆర్‌ఎంవో డాక్టర్ సుమన్ మోహన్‌రావు వివరణ కోరగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని దవాఖానకు తీసుకురాగానే చికిత్స అందించినట్లు చెప్పారు. అన్ని రకాల పరీక్షలు చేసినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించలేదు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లాలని క్షతగాత్రుడితో ఉన్న వ్యక్తికి తెలియజేశాం. కరీంనగర్ తీసుకెళ్లడానికి బాధితుడికి సంబంధించిన వ్యక్తులు రావడంలో ఆలస్యమైంది. క్షతగాత్రుడిని కరీంనగర్‌లోని దవాఖానకు తీసుకెళ్లే వరకు వైద్యం అందించినట్లు స్పష్టం చేశారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

వాగు ఒడ్డున నిల్వ చేసిన ఇసుక

కొడిమ్యాల, ఫిబ్రవరి 23: కొడిమ్యాల మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. మండలంలోని పోతారం నుంచి కొడిమ్యాల పెద్ద వాగు బ్రిడ్జి వరకు సుమారు 10 కిలో మీటర్ల మేర ఇసుక ఉంది. దీంతో కొడిమ్యాలతో పాటు తిర్మలాపూర్, సంద్రల్లపల్లి, పోతారం గ్రామాలకు చెందిన సుమారు 15 ట్రాక్టర్లలో నిత్యం ఇసుక తరలిస్తున్నారు. వాగులో జేసీబీతో ఇసుక తోడి ఒడ్డున నిల్వ చేస్తున్నారు. దూరాన్ని బట్టి ఒక్కో ట్రిప్పుకు రూ. 3000, రూ. 2500, రూ. 2000 చొప్పున విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మండలంలో ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. సిబ్బందిని కూడా పురమాయిస్తా. ఇసుక అక్రమంగా తరలించకుండా తనిఖీలు చేపడుతం.

-రమేశ్, తహసీల్దార్

దళితులపై అఘాయిత్యాలు ఆపాలి

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్

జగిత్యాల, ఫిబ్రవరి 23: దేశంలో దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలు, దౌర్జన్యాలను ఆపాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోనుగురి హన్మంత్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. 20శాతం ఉన్న దళితులకు జనాభా దమాషా ప్రకారం బడ్జెట్ కేటాయించాలని కోరారు. దేశవ్యాప్తంగా దళిత మహిళలపై అఘాయిత్యాలు, దౌర్జన్యాలు జరిగిన కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇక్కడ జేఏసీ నాయకుడు పేట భాస్కర్, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ ముఖ్రం, జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్, జిల్లా సహాయ కార్యదర్శి రాంబాబు, జిల్లా కోశాధికారి లక్ష్మణ్, ప్రవీణ్, వెన్న మహేశ్, నాయకులు రాజయ్య, పురుషోత్తం, రాజేశం, స్వామి, జ్యోతి, సాగర్, గంగారెడ్డి, తదితరులున్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో యువకుడిపై దాడి

గాయపడినమహేశ్

కొడిమ్యాల, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓ యువకుడిపై నలుగురు ఇనుప రాడ్‌తో దాడి చేయగా తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నడిగట్ల హరీశ్, అదే గ్రామానికి చెందిన శివరాత్రి మౌనిక ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు మేజర్లు కావడంతో ఆదివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమకు ప్రాణహాని ఉందని ఎస్ఐ సందీప్‌కు తెలిపారు. దీంతో ఆయన ఇరువురి కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి కిందికి వస్తుండగా ఒకరి మధ్య ఒకరికి మాట మాట పెరగడంతో హరీశ్ అన్న మహేశ్‌పై మౌనిక బంధువులు ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో గాయాలయ్యాయి. జగిత్యాల దవాఖానకు తరలించి చికిత్స అందించారు. మహేశ్ తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు మౌనిక కుటుంబ సభ్యులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

గొర్రెల కాపరులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

రాయికల్, ఫిబ్రవరి 23: ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరులకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లీపూర్ గ్రామంలో ఆదివారం ఆయన యాదవ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్‌యాదవ్ మాట్లాడుతూ, 50 సంవత్సరాలు నిండిన గొర్రెల కాపరులకు పెన్షన్ ఇవ్వాలని, యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో యాదవులకు రిజర్వేషన్ కల్పించి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యాదవ సంఘం సభ్యులు యాదవనేని రాజలింగం యాదవ్, తాలూకా రాజేశ్ యాదవ్, మెతుకు మహేశ్, నర్సయ్య, లింగన్న, గంగమల్లు, వెంకటేశ్, గంగారెడ్డి, శ్రీను, మనోజ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

కథలాపూర్, ఫిబ్రవరి 23: కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన బోయిని భూమయ్య(78) గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భూమయ్య భార్య గతంలో మృతిచెందగా, మిగతా కుటుంబీకులు వేరుగా నివాసం ఉంటున్నారు. భూమయ్య వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండడంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం గ్రామస్తులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. భూమయ్య మనువడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 23: నాచుపల్లి గ్రామానికి చెందిన చిర్ర పాల్ (46) ఈనెల 14న రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మండలంలోని తిప్పన్నపేట గ్రామంలో అదుపుతప్పి కిందపడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పాల్ భార్య గంగజ మున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు.

నేడు ఇంటర్వ్యూలు

పెగడపల్లి, ఫిబ్రవరి 23: పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రుణాల మంజూరు కోసం దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఎకానమిక్ రిహాబిలిటేషన్ పథకం (ఈఆర్‌ఎస్) కింద దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఉదయం 11.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు.

వివాహ వేడుకకు మాజీ మంత్రి హాజరు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, ఫిబ్రవరి 23: వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బాలసాని సత్యం-పుష్ప దంపతుల కూతురు సింధూ వివాహం ఆదివారం కిషన్‌రావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు గండ్ర విష్ణువర్ధన్‌రావు, రాంచందర్, జూపాక కుమార్, మూగల సత్యం, అల్లె వెంకటేశ్, బాలసాని రవి, కొత్త హరీశ్, తరల్ల చంద్రయ్య, కల్లు నారాయణ, కొదురుపాక అనిల్, వన్నెల దామోదర్‌రెడ్డి, శంకరయ్య, తిరుపతి తదితరులున్నారు.

పుస్తె మట్టెలు అందజేత

శ్యామలకు పుస్తె మట్టెలు అందజేస్తున్న ప్రభాకర్-గీత దంపతులు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 23: భీమారం మండలం రాజలింగంపేట గ్రామానికి చెందిన నిరుపేద రేగుల మల్లేశం-పోశవ్వ దంపతుల కూతురు శ్యామల వివాహం నిశ్చయమైంది. కాగా, కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ మాడిశెట్టి ప్రభాకర్-గీత దంపతులు ఆదివారం పుస్తె మట్టెలు, పట్టు చీర అందజేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కోరుట్ల, ఫిబ్రవరి 23: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని శృంగేరీ శారద పీఠం ఆస్థాన పౌరాణికుడు గర్రెపల్లి మహేశ్వర శర్మ అన్నారు. పట్టణంలోని వాసవి కల్యాణ భవనంలో ఆదివారం సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గర్రెపల్లి మహేశ్వర శర్మ భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఇక్కడ సమితి ప్రతినిధులు, భక్తులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

రాయికల్, ఫిబ్రవరి 23: మండలంలోని సింగర్రావుపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జగిత్యాలలోని శ్రీ సాయినాథ్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యుడు మహేంద్రనాథ్ గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ దన్నపునేని రాంచందర్ రావు, బర్కం కృష్ణమూర్తి, జాల జలపతి, ఆర్ఎంపీలు శ్రీనివాస్, కడార్ల శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ గవర్నర్ పరామర్శ

మారుతీనగర్, ఫిబ్రవరి 23: పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు పిన్నంశెట్టి గంగాధర్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా ఆదుకుంటామని గంగాధర్ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

కరపత్రం ఆవిష్కరణ

జగిత్యాల, ఫిబ్రవరి 23: జిల్లా కేంద్రంలోని గుట్ట రాజేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 26న నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొత్తపెల్లి శ్రీనివాస్, లక్ష్మీనరసింహరావు, భాస్కర్, ఆలయ అర్చకుడు గుంటి జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా శివరాత్రి జాతర ఉత్సవాలు

సారంగాపూర్, ఫిబ్రవరి 23: సారంగాపూర్ మండలం పెంబట్లలోని దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించే మహా శివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో వడ్లూరి అనూష, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య తెలిపారు. ఉత్సవాలకు సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లితో పాటు జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

పెగడపల్లి, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, రాంచంద్రం తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

యూత్ కార్యాలయ ప్రారంభాన్ని అడ్డుకున్న అధికారులు

యూత్ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

సారంగాపూర్, ఫిబ్రవరి 23: బీర్‌పూర్ శివారులోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ జాతర గ్రౌండ్ సమీపంలో ఆదివారం మండల కేంద్రానికి చెందిన యూత్ సభ్యులు యూత్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని చెప్పడంతో విషయం తెలుసుకున్న అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు వెళ్లి అడ్డుకున్నారు. అటవీ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు చెప్పడంతో, కొంతమంది అక్రమ నిర్మాణాలు ఎలా చేపట్టారని, వారికి ఏవిధంగా అనుమతులు ఇచ్చారని యూత్ సభ్యులు ప్రశ్నించారు.? మార్చి 10వ తేదీ వరకు అటవీ భూమిలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ, అధికారులు ఇచ్చిన గడువు వరకు ఆక్రమణలను తొలగించాలని, లేకుంటే తాము కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు నిరుపేద యువతులకు ఎన్ఆర్ఐ ద్యావనపెల్లి రాధాకృష్ణ రూ.10 వేలు పంపగా ఆయన సహోదరుడు రామకృష్ణ స్థానిక నాయకులతో కలిసి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు కొంతం రాజం, గంగాధర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు

పేద యువతులకు నగదు అందజేస్తున్న రామకృష్ణ

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం

గాయత్రీ బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్

పెగడపల్లి, ఫిబ్రవరి 23: గాయత్రీ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ ముత్యాల లక్ష్మణ్‌రెడ్డి, సీఈవో వనమాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గాయత్రీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన శాఖను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంక్ సేవలు అందిస్తున్నామని, 2000 సంవత్సరంలో జగిత్యాలలో ఒక్క బ్రాంచ్‌తో ప్రారంభమైన బ్యాంక్ సేవలు ప్రస్తుతం 58 బ్రాంచ్‌లకు చేరుకుందన్నారు. 7,73,258 మంది ఖాతాదారులతో రూ. 3062.50 కోట్ల వ్యాపారం చేస్తున్నట్లు వివరించారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీలత మాట్లాడుతూ, తెలంగాణ కో-ఆపరేటివ్ బ్యాంకులో గాయత్రీ బ్యాంక్ అగ్రస్థానంలో ఉందని, రూ.550కి సేవింగ్ ఖాతాను అందించడంతో పాటు ఏటీఎం కార్డు, చెక్ బుక్, ఫోన్ పే, గూగుల్ పే వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ బింగి తిరుపతి, పాలకవర్గ సభ్యులు సౌజన్య, రాజిరెడ్డి, సత్యం, అశోక్, శ్రీనాథ్, విజయ్, గంగాధర్, మాధవి, సతీశ్, రవికుమార్, బ్రాంచ్ ఇన్‌చార్జి కావ్యనంద్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మోహన్‌రెడ్డి, తిరుపతి, చందు, సాగర్‌రావు, గోపాల్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు

మల్లాపూర్, ఫిబ్రవరి 23: మండలంలోని చిట్టాపూర్ సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలోని సహకార సంఘ కార్యాలయ ఆవరణలో ఆదివారం వారు సమావేశమై మాట్లాడారు. సహకార సంఘంలో 2014-25 వరకు రూ. 1.26 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు ఇదివరకే సంబంధిత ఆడిట్ అధికారులు నివేదించారని, ఇప్పటికీ ఆ సొమ్ము రికవరీ చేయడం లేదన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులు, చైర్మన్‌పై చర్యలు తీసుకోవడం లేదని, దీనిపై డీసీవో, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశం ఐక్యవేదిక అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మహేశ్, కైలాసపతి, అభిషేక్, రవి, నారాయణ, కృష్ణ, లక్ష్మీనారాయణ, దామోదర్, పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని ఆదిలాబాద్ వరకు విస్తరించాలి

జగిత్యాల, ఫిబ్రవరి 23: సూర్యపేట నుంచి జనగాం, సిద్దిపేట మీదుగా సిరిసిల్ల వరకు నిర్మాణం చేపట్టిన జాతీయ రహదారిని వేములవాడ, జగిత్యాల, బీర్పూర్ మండలం జన్నారం, ఊట్నూరు, ఇంద్రవెల్లి మీదుగా ఆదిలాబాద్ వరకు విస్తరించాలని ప్రజాసంక్షేమ సేవాసదన్ జిల్లా అధ్యక్షుడు సూరజ్ శివశంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, ఇతర జిల్లాల నుంచి జగిత్యాల మీదుగా మహారాష్ట్ర, గుజరాత్‌కు సరుకుల రవాణా వాహనాలు నడుస్తాయన్నారు. ఈ జాతీయ రహదారిని విస్తరిస్తే వేములవాడతో పాటు కొండగట్టు, ధర్మపురి, యాదగిరిగుట్ట, కొమురవెల్లి, ఇంద్రవెల్లి, నాగోబా, ఇతర ఆలయాలను దర్శించుకోవడానికి భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. సుమారు